క్లుప్తంగా

ఇబ్రహీంపట్నం చేరిన అయోధ్య రాముని అక్షింతలు



అక్షింతలు ఊరేగింపుగా తీసుకవస్తున్న భక్తులు

ఇబ్రహీంపట్నం: అయోధ్య రామమందిర రాముని అక్షింతలను శుక్రవారం ఇబ్రహీంపట్నంకు చేరుకోగా వేంకటేశ్వర ఆలయం నుంచి పాత బస్టాండ్ ఆంజనేయస్వామి ఆలయం వద్దకు వీహెచ్‌పీ, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో భక్తి , శ్రద్ధలతో తీసుకవచ్చారు. ఈ అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేయనున్నట్లు వీహెచ్‌పీ తెలిపారు.కార్యక్రమంలో వీహెచ్‌పీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల క్లీన్ టాయిలెట్ క్యాంపెయిన్



సన్మానిస్తున్న విద్యార్థులు

కోరుట్ల: పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల విద్యార్థులు స్వచ్ఛభారత్ లో భాగంగా మున్సిపల్ ఆధ్వర్యంలో శుక్రవారం క్లీన్ టాయిలెట్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పబ్లిక్ టాయిలెట్‌ల వద్ద ప్రచారం నిర్వహించారు. బహిరంగ మల, మూత్ర విసర్జన లేని పట్టణంగా తీర్చి దిద్దేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్, మహేశ్, శివకుమార్, హేమంత్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు డీఎస్పీ నాయకుల వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కథలాపూర్: ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో మార్పులు చేయాలని కోరుతూ తహసీల్దార్‌కు ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్పీ) నాయకులు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. ఆర్టీసీ బస్సుల్లో తెలుపు రేషన్ కార్డులు ఉన్నవారికే ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఉచిత ప్రయాణం వర్తింపజేయవద్దన్నారు. ఈ పథకంతో ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్లకు నెలకు రూ. 5 వేలు సాయం అందించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ నాయకులు హరీశ్‌గౌడ్, రమేశ్, రాజేందర్, తిరుపతిగౌడ్, రాజేందర్, నాగేశ్, శ్రీనివాస్, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధు విడుదల చేయాలి



వినతిపత్రం అందిస్తున్న కౌన్సిలర్ శ్రీధర్‌రెడ్డి

రాయికల్: ప్రభుత్వం వెంటనే రైతుబంధును విడుదల చేయాలని 4వ వార్డు కౌన్సిలర్ తురగ శ్రీధర్‌రెడ్డి శుక్రవారం తహసీల్దార్ ఖయ్యూంకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాసంగి పంట పెట్టుబడికి డబ్బులు లేకపోవడంతో చిన్న, సన్నకారు రైతులు ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతుబంధును విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు నాయకులు సుతారి తిరుపతి, నీలి తిరుపతి, తురగ మల్లారెడ్డి, రాజు, గంగన్న, షేక్ హుస్సేన్, బ్రహ్మతేజ పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు జిజ్ఞాసలో భాగంగా రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం వ్యవసాయ క్షేత్ర పర్యటన చేశారు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో మోతె శ్రీహరి చేపట్టిన సేంద్రియ పంటల సాగును పరిశీలించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ వాణి, జువాలజీ లెక్చరర్ భిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

రాయికల్‌లో..

రాయికల్: పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు శుక్రవారం రాయికల్ పట్టణంలోని చెన్నకేశవనాథ ఆలయం, తహసీల్ కార్యాలయం, ఇటిక్యాలలోని వృద్ధాశ్రమం, పిరమిడ్, కూరగాయల మార్కెట్, పెట్రోల్‌బంక్‌లను క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఆలయ విశిష్టత విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.





ధర్మపురి మండలం దోనూర్ పాఠశాలలో విద్యార్థుల నివాళి బొమ్మెన పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శన



నర్సింహులపల్లెలో విద్యార్థులకు క్విజ్ పోటీలు



ఇబ్రహీంపట్నంలో 1729 ఆకారంలో విద్యార్థులు

ఘనంగా గణిత దినోత్సవం

జగిత్యాల / కోరుట్ల/ మెట్‌పల్లి/ఇబ్రహీంపట్నం/కథలాపూర్/ధర్మపురి/ సారంగాపూర్/రాయికల్/ మేడిపల్లి/వెల్గటూర్/మల్యాల: గణిత శాస్త్ర మేధావి శ్రీనివాస్ రామానుజన్ జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శుక్రవారం గణిత శాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గణిత శాస్త్రంపై పలు నమునాలు ప్రదర్శించారు. గణిత శాస్త్ర ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు.శ్రీనివాస రామానుజన్ గణితంలో కనుగొన్న సూత్రాలతో గణితంలో వచ్చిన మార్పులను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమాల్లో విద్యార్థులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మెట్‌పల్లిలో విద్యార్థుల గణిత ప్రదర్శనలు



వెల్గటూర్‌లో గణిత నమూనాల ప్రదర్శన



మల్యాలలో గణిత ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు



కోరుట్లలో విద్యార్థుల గణిత ప్రదర్శనలు



రాయికల్‌లో గణిత నమూనాల ప్రదర్శనలతో విద్యార్థులు

మంత్రి పొన్నంను కలిసిన ఎమ్మెల్యే



మంత్రికి అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యే

జగిత్యాల: రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కరీంనగర్‌లోని అతని నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో విశేష కృషి చేశారని, మాకు సన్నిహిత సంబంధాలున్నాయన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

మంత్రి పొన్నంను కలిసిన ఎన్నారై సెల్ అధ్యక్షుడు

మేడిపల్లి: రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను తెలంగాణ ఎన్నారై సెల్ అధ్యక్షుడు నరేశ్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. మహాలక్ష్మి పథకంపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మేడిపల్లి మండలంలోని పలు గ్రామాల్లో బస్సుల రూట్లు పెంచాలని కోరారు. ఆయన వెంట మాదం వినోద్ యాదవ్, దేవ్ యాదవ్, తేలు లక్ష్మి, రంజిత్ ఉన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- పట్టణాభివృద్ధే ధ్యేయం
- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పట్టణాభివృద్ధే ధ్యేయమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఇన్‌చార్జి చైర్మన్ గోలి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పట్టణంలో పారిశుద్ధ్యం, తడి, పొడి చెత్త విషయంలో సీరియస్‌నెస్ ఉండాలని, చెత్త నుంచి ప్లాస్టిక్ వేరు చేయకపోవడం వల్ల డంపింగ్‌యార్డు గుట్టలాగా తయారైందన్నారు. చుట్టు గ్రామాలకు, డబుల్‌బెడ్ రూం లబ్ధిదారులకు ఇబ్బంది కలుగుతుందన్నారు. గత కరోనా సమయంలో కొన్ని బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, చెల్లింపుల్లో జాప్యం చేయడం బాధాకరమని, వాటిని సత్వరమే జారీ చేయాలన్నారు. కరోనా మళ్లీ విజృంభిస్తున్న నేపథ్యంలో పారిశుద్ధ్య అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు.



ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న అధికారులు

శానిటేషన్ అస్తవ్యస్తం..

జగిత్యాల మున్సిపాలిటీలో శానిటేషన్ అస్తవ్యస్తంగా ఉందని కొందరు కౌన్సిలర్లు పేర్కొన్నారు. కౌన్సిలర్ జయశ్రీ మాట్లాడుతూ, శానిటేషన్ వాహనాల రిపేర్లు, డీజిల్ వివరాలపై రాతపూర్వకంగా సమాచారం ఇవ్వాలని డిమాండ్ చేయగా, అధికారులు పూర్తి వివరాలు ఇస్తామని, వీటిపై ఎంక్వైరి కోసం సీడీపీఎంకు దరఖాస్తు చేస్తామన్నారు. బతుకమ్మ చీరలు సైతం వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

చైర్ పర్సన్‌గా బీసీ మహిళను ఎన్నుకోవాలి

జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బీసీ మహిళను ఎన్నుకుని అంబేద్కర్ రాజ్యాంగం కల్పించిన హక్కును పరిరక్షించాలని బీజేపీ బల్దియా ఫ్లోర్ లీడర్ అనుమల్ల కృష్ణహరి కోరారు. శుక్రవారం సమావేశం అనంతరం మాట్లాడుతూ నిజామాబాద్ రోడ్డు నిర్మాణ పనుల్లో మిషన్ భగీరథ పైపులు డ్యామేజ్ చేశారని ఆ పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌తోనే పగిలిపోయిన పైప్‌లైన్ స్థానంలో కొత్తది వేయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

'బల్దియాలో ఆగని అవినీతి'

జగిత్యాలటౌన్: ఎన్నిసార్లు నిలదీసినా, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా జగిత్యాల బల్దియాలో అవినీతి ఆగడం లేదని కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కల్లెపెల్లి దుర్గయ్య ఆరోపించారు. శుక్రవారం జగిత్యాల బల్దియా సాధారణ సమావేశం అనంతరం మాట్లాడారు. కల్లెపెల్లి దుర్గయ్య మాట్లాడుతూ ఎలాంటి ముందస్తు అనుమతులు తీసుకోకుండా శానిటేషన్, రిపేర్ల పేరిట పన్నుల రూపంలో ప్రజలు చెల్లించిన లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. వాతావరణ కాలుష్యం నియంత్రించేందుకు ప్రభుత్వం ఫ్లెక్సీలను నిషేధించినా బల్దియా పాలకవర్గం మాత్రం ప్రచార ఆర్బాటం కోసం ఫ్లెక్సీలకు పెద్ద మొత్తంలో ప్రజాధనం వెచ్చించడం సరికాదన్నారు. శానిటేషన్ విభాగంలో టెక్నికల్ అధికారి లేకున్నా సిబ్బందే రిపేర్లు చేస్తూ లక్షలాది రూపాయల బిల్లులు పెట్టి అవినీతికి పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బయోమెట్రిక్ లేకుండానే బిల్లులు తీసుకున్న బాధ్యులపై చర్యలు తీసుకుని అరికట్టాలని కోరారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతర కృషి

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- క్రిస్మస్ కానుకలు పంపిణీ



క్రిస్మస్ కానుకలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

వెల్గటూర్: ధర్మపురి నియోజక అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం ఎండపల్లి మండలం రాజారాంపల్లిలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన క్రిస్‌మస్ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేసి అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందని, ప్రతీ ఒక్కరికీ న్యాయం చేస్తుందని అన్నారు. అనంతరం రాజారాంపల్లిలో కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి (కాకా) వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్‌రెడ్డి, సర్పంచ్ మెరుగు మురళి, ఉప సర్పంచ్ సందీప్‌రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గండ్ర శ్రీకాంత్ రావు, గెల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేతకాని కులస్తులు ఐక్యత చాటాలి

ధర్మపురి: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో నేతకాని కుల బాంధవులు ఐక్యతను చాటాలని ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని బుద్దేశ్‌పల్లెలో శుక్రవారం నేతకాని కులస్తులతో ఏర్పాటు చేసిన మాటా ముచ్చటలో మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ కేంద్రప్రభుత్వం ద్వారా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రతి పేదవారికి అందే విధంగా కృషి చేస్తున్నారని తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపెల్లి నుంచి బీజేపీ టికెట్ నేతకాని కులస్తులకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గంగయ్య, దుర్గం కనుకయ్య, ప్రమీల, దుర్గం లక్ష్మి, కామెర లక్ష్మణ్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న జాడి బాల్ రెడ్డి

గ్రామాల్లో వికసిత భారత్ సంకల్పయాత్ర



సంగెం - శ్రీరాంపూర్‌లో మాట్లాడుతున్న అధికారులు

మల్లాపూర్: అర్హులైన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను చేరవేసేందుకే 'వికసిత భారత్ సంకల్ప యాత్ర'ను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజశ్రీనివాస్ అన్నారు. మండలంలోని సంగెం-శ్రీరాంపూర్‌లో శుక్రవారం నిర్వహించిన వికసిత భారత్ సంకల్ప యాత్ర సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వికసిత భారత్ సంకల్ప యాత్రలో ప్రజలే ప్రచారకర్తలన్నారు. ఈ కార్యక్రమాన్ని అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీవో జగదీష్, సర్పంచ్ పాలేపు దిలీప్, ఉపసర్పంచ్ బెజ్జారపు నిఖిత, హెల్త్ సూపర్‌వైజర్ ఇందిర, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఎన్‌ఎంలు సుశీల, మమత, సుశీల, ఆశ కార్యకర్తలు ఎల్కా భూదేవి, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై ప్రచారం

సారంగాపూర్: మండలంలోని మూడు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా కేంద్రం అమలు చేస్తున్న పథకాలపై శుక్రవారం ప్రచారం నిర్వహించారు. సారంగాపూర్, రేచపల్లి, లచ్చనాయక్ తండా గ్రామాల్లో కేంద్రం ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు వివరించారు. ఆయా గ్రామాల్లో ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా వైద్యశిబిరాలు నిర్వహించారు. మండల వైద్యాధికారి రాణి మైత్రీరెడ్డి, ఎంపీవో శశికుమార్, సూపర్‌వైజర్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

టీఆర్టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చిన్నయ్య

రాయికల్: టీఆర్టీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలానికి చెందిన బొల్లె చిన్నయ్య, రాష్ట్ర సాంస్కృతిక కమిటీ కన్వీనర్‌గా ముక్కెర శేఖర్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు తుంగూరి సురేశ్, ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా వీరిని మండల అధ్యక్షుడు ఎలిగేటి రాజ్‌కిశోర్, ప్రధాన కార్యదర్శి రాము అభినందించారు.

అంగన్‌వాడీ అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరపాలి

మెట్‌పల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్రమాలపై ప్రభుత్వం విజిలెన్స్ విభాగం చేత విచారణ జరిపించాలని సింగిల్ విండో డైరెక్టర్ కొమొరెడ్డి తిరుపతిరెడ్డి శుక్రవారం కోరారు. మెట్‌పల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పాలు, గుడ్లతో పాటు ఇతర సరుకులను లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా కొందరు బహిరంగ మార్కెట్‌కు తరలిస్తూ అమ్ముకుంటున్నారన్నారు. వరంగల్ ఆర్‌జేడీతో పాటు పలువురికి వీటిపై ఫిర్యాదు చేస్తే విచారణ జరిపారే తప్ప బాధ్యులపై ఏలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. సీడీపీవోతో పాటు కొందరు సూపర్‌వైజర్ల సహకారంతో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందని, ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి విజిలెన్స్ విభాగం చేత విచారణ జరిపించాలన్నారు. లేని పక్షంలో సీఎంవో కార్యాలయానికి ఫిర్యాదు చేస్తానని ఆయన పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

నేడు మండల సర్వసభ్య సమావేశం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ సాయిరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో భీమేశ్ రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందని, ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ హాజరవుతారని పేర్కొన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు హాజరు కావాలని పేర్కొన్నారు.

కల్యాణ ఆహ్వాన పత్రిక అందజేత

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలో ఆదివారం జరగనున్న లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణానికి రావాలని శుక్రవారం మెట్‌పల్లిలో టీపీసీసీ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావుకు ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కల్లెడ రాజశేఖర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

మల్లాపూర్: మండలంలోని వేంపల్లిలో శుక్రవారం అనారోగ్యంతో తోట వెంకన్న(70) అనే వృద్ధుడు మృతి చెందగా, దహకసంస్కారాలకు రూ. 10 వేలను బాధిత కుటుంబానికి వార్డుసభ్యురాలు పడాల మానస అందించారు. గ్రామపంచాయతీ పాలకవర్గ తీర్మానం ప్రకారం గ్రామంలోని ఎవ్వరు మృతి చెందిన దహన సంస్కరాలకు రూ.10 వేల ఆర్థికసాయం అందిస్తున్నట్లు తెలిపారు.

పేదల మనిషి జి.వెంకట స్వామి

కోరుట్ల: కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకట స్వామి నిరుపేదల మనిషి అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. శుక్రవారం వెంకటస్వామి వర్ధంతిని జువ్వాడి భవన్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు తిరుమల గంగాధర్ గౌడ్, కుంతం రాజం, నాయకులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం

మల్లాపూర్: మండలంలోని మొగిలిపేటలో బాధిత కుటుంబానికి శుక్రవారం బీజేపీ నాయకులు రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంగ నర్సయ్య అనే వృద్ధుడు శుక్రవారం మృతి చెందగా, స్థానిక బీజేపీ నాయకులు స్పందించి రూ.5వేల ఆర్థికసాయం కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెంబట్ల, పోచంపేట లో బోర్లు ఏర్పాటు

సారంగాపూర్: మండలంలోని పోచంపేట, పెంబట్ల గ్రామాల్లోని మున్నూరుకాపు సంఘాల భవనాల వద్ద తాగునీటి సమస్య తీర్చడానికి శుక్రవారం మూడు బోర్లను ఏర్పాటు చేశారు. బోర్లను ఏర్పాటు చేయాలని నాయకులు జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంతను కోరగా, ఆమె సానుకూలంగా స్పందించి బోర్లను మంజూరులు చేశారని, ఈ సందర్భంగా ఆమెకు మున్నూరు కాపు సంఘం నాయకులు,ఎంపీపీ కోల జమున, సొసైటీ చైర్మన్ గుర్నాథం మల్లారెడ్డి, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకుల నిరసన



ఎంఈవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు

కథలాపూర్: పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ ఎంఈవో కార్యాలయం ఎదుట శుక్రవారం మధ్యాహ్న భోజన నిర్వాహకులు నిరసన వ్యక్తం చేశారు. అక్టోబర్ నెల నుంచి నిధులు రాకపోవడంతో తాము ఆర్థికంగా ఇబ్బందులపాలవుతున్నామన్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు చొరవ చూపి బకాయిలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సుతారి రాములు, చెన్నవేని దశరథం, మండల సభ్యులు పాల్గొన్నారు.

కనుల పండువగా పడిపూజ



రాయికల్‌లో పడిపూజలో పాల్గొన్న స్వాములు

రాయికల్: పట్టణంలో నారికేళ గురుస్వామి మచ్చ శ్రీధర్ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పడిపూజ శుక్రవారం రాత్రి చెన్నకేశవనాథ ఆలయంలో కనుల పండువగా నిర్వహించారు. అర్చకులు సత్యంశర్మ, సాయిసుదీర్‌శర్మల ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు చేశారు.నాగేశ్వరరావు భజన సంకీర్తనలు అయ్యప్ప దీక్షపరులు చేసిన భజనలతో అయ్యప్ప నామస్మరణ మార్మోగింది.